క్లుప్తంగా

పిడపర్తిని అభినందించిన ఎంపీ సురేష్


పేరిరెడ్డిని అభినందిస్తున్న ఎంపీ సురేష్

చినగంజాం: జిల్లా ప్రధానోపాధ్యాయుల విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిడపర్తి పేరిరెడ్డిని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అభినందించారు. గురువారం ఎంపీ నందిగం సురేష్‌ను ఆయన స్వగృహంలో పిడపర్తి కలిశారు. విద్యారంగానికి ఆయన అందించిన అనేక కార్యక్రమాలతో పాటు, ఎన్‌సీసీ చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించడం అభినందనీయమన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక



మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులు

జె.పంగులూరు: మండలంలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా తన్నీరు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ రహంతుల్లాని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ సభ్యులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

లక్ష్మీ నరసింహుడి ఆదాయం రూ. 4.62 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ క్షేత్రధిపతి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో గురువారం దేవాదాయ శాఖ అధికారులు సమక్షంలో హుండీ లెక్కించారు. మొత్తం భక్తుల కానుకల ద్వారా లభించిన ఆదాయం రూ.4,62,891 వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు నర్రావుల ఏడుకొండలు, ఈవో కోటిరెడ్డి పర్యవేక్షించారు.

వ్యక్తిపై దాడి విషయమై కేసు

మార్టూరు: ఓ వ్యక్తిపై ముగ్గురు దాడి చేసి కులం పేరుతో దూషించిన విషయమై పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. మార్టూరు నేతాజీ కాలనీకి చెందిన నాగండ్ల చిన్న సుబ్బారావు తన మనుమడుతో కలిసి కారులో బుధవారం రాత్రి సాయిబాబా ఆలయం రోడ్డులో సెంటర్ నుంచి తననివాసానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దారికి అడ్డుగా ఉన్న బైకులను తొలగించాలని సుబ్బారావు కారు హారన్ మోగించాడు. బైకు యజమాని మార్టూరుకు చెందిన వీరాంజనేయులు ఆతని సోదరులు శ్రీకాంత్, సతీష్లు రోడ్డుకు అడ్డంగా ఉన్న బైకులను తొలగించకుండా తమ బజారు వైపు ఎందుకు వచ్చావంటూ చిన్న సుబ్బారావుతో వాదనకు దిగారు. వాదన పెరిగి పెద్దదై సోదరులు ముగ్గురూ కలిసి చిన్న సుబ్బారావుపై దాడి చేసి కులం పేరుతో దూషించారు. దాడిలో గాయపడిన చిన్న సుబ్బారావును స్థానికులు మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

బల్లికురవ: బూత్ కమిటీ సభ్యుల ఎంపికతో గ్రామాల వారీగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు బీజేపీ బాపట్ల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆర్. కాశీదేవి తెలిపారు. గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా వైదన కొమ్మినేనివారి పాలెం గ్రామాల్లో ఆమె పర్యటించారు.

అక్రమ మద్యం స్వాధీనం

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అక్రమంగా మద్యం వ్యాపారం నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని పర్చూరు ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకొని అతని నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శివరామప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఈబీ సీఐ యశోదరాదేవి ద్రోణాదుల్లో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారనే ముందస్తు సమాచారంతో తమ బృందంతో కలసి షేక్ బాబూషాకు చెందిన బంక్‌ను తనిఖీ చేశారు. అమ్మకానికి నిల్వ చేసిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని బాబూషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నవ్వీన కుందేరు.. ఎగిరిపోయిన సమస్యలు


కుందేరులో వ్యర్థాలను తొలగిస్తున్న పొక్లెయిన్


కుందేరులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

- 30 ఏళ్ల సమస్యకు చరమగీతం
- కుందేరు ప్రక్షాళనతో దుర్వాసన నుంచి బయటపడిన ప్రజలు
- మురుగు, వరదనీటికి పరిష్కార మార్గం

చీరాల: ఎన్నో ఏళ్ల తర్వాత కుందేరు నవ్వుతోంది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెత్త, చెదారంతో నిండిపోయి రూపుకోల్పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 ఏళ్ల సమస్యకు చరమగీతం పాడింది. పాలకులు ఎందరు మారినా కుందేరు ప్రక్షాళన మాత్రం అతీగతీ లేదు. చాలా ఏళ్లుగా మురుగునీటితో చీరాల పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాల ప్రజలు కూడా అనేక అవస్థలు పడుతున్నారు. కుందేరు ప్రాంతం ఉన్న వైపు ఉన్న కోర్టు రోడ్డు, కొత్తపేట, జాండ్రపేట, దేశాయిపేట వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే నరకయాతన. భరించలేని దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతుంటే కుందేరులో పేరుకుపోయిన మురుగునీరు, తమిళనాడు డ్రైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే కలుషిత రసాయనాలతో వచ్చే నీరుతో భూగర్భజలాలు సైతం పూర్తి స్థాయిలో కలుషితం అవుతున్నాయి. కుందేరులో పారుదల లేకపోవడమే అందుకు కారణం. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు చొరవ తీసుకుని నిధులు రాబట్టడంతో మురుగు సమస్యకు పరిష్కార మార్గం దొరికింది. ప్రధానంగా కుందేరులో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాలు, జమ్ముతో పారుదల లేకుండా పోయింది. పట్టణంలో నుంచి వచ్చే మురుగు నీరంతా కుందేరులో కలుస్తుంది. అలానే కొత్తపేట, జాండ్రపేట, దేశాయిపేట వంటి మేజర్ పంచాయతీల నుంచి వచ్చే మురుగునీరు కూడా కలుస్తుంది. డ్రైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే రసాయనాలు కలుస్తున్నాయి. దీంతో కుందేరు మరో మూసీ నదిగా మారింది. కుందేరులోని వ్యర్థాలను తొలగించే ప్రక్రియను ప్రారంభించింది.

సంతోషం వ్యక్తం చేసిన ప్రజలు..

ప్రస్తుతం నివాస ప్రాంతాలు ఉన్న ఆరు కిలోమీటర్ల పొడవున ఉన్న కుందేరు కాలువలో పెరిగిపోయిన జమ్ము, తూటుకాడ, నాచు తొలగింపు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కరణం చొరవతో డ్రైనేజి శాఖ అధికారులతో మాట్లాడి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.12 లక్షలు నిధులు మంజూరు చేయించారు. బురదలో ఉన్న వీటిని తొలగించేందుకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి లాంగ్ స్టిక్ పొక్లెయినర్‌ను తెప్పించారు. గత కొద్ది రోజుల నుంచి ఈ ప్రక్రియ జరుగుతోంది. కుందేరులోని మురుగునీటి పారుదల కార్యక్రమాలను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పూర్తి స్థాయిలో పూడికలు తీసేందుకు నెల రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. నెలరోజుల్లో కుందేరులోని వ్యర్థాల ప్రక్షాళన పూర్తయితే పూర్తి స్థాయిలో నీరు పారుదల జరిగి ప్రజల ఇబ్బందులు తొలగుతాయి.

కుందేరులోని వ్యర్థాల ప్రక్షాళన వేగవంతం..



కుందేరు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాల ప్రక్షాళన పనులను వేగవంతంగా చేస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా వ్యర్థాలతో నిండిపోవడంతో నీటి పారుదల లేక దోమలు, దుర్వాసన వెదజల్లుతుంది. సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాం. నెలరోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

– కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే

ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం..



ఈపూరుపాలెం నుంచి చిన్నగంజాం మండలం వరకు కుందేరు కాలువ విస్తరించి ఉంది. అలానే చీరాల పట్టణం, కొత్తపేట పరిధిలో ఇరువైపులా గృహాలు ఉన్నాయి. వీటిల్లో వినియోగించిన మురుగునీటితో పాటు పట్టణంలో సగభాగం వరకు కాలువల నుంచి ఇక్కడికే నీరు చేరుతుంది. ఎటువంటి పూడికతీత పనులు జరగకపోవడంతో దోమలు, దుర్వాసన ఎక్కువగా ఉంది. కుందేరులోని ప్రస్తుతం ప్రక్షాళన పనులు చేపట్టడడంతో ఆ సమస్య తీరుతుంది.

–కరణం వెంకటేష్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి


సమస్యలు వింటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటా ..

- నియోజవర్గ ఇన్‌చార్జి ఆమంచి

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఆయన పార్టీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలతో మాట్లాడారు. వివిధ గ్రామాల్లో ప్రజా సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించి సత్వర సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రజలకు మీ ప్రాంతంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, జననేత మన జగనన్న ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, దేశంలో ఎక్కడా అమలు లేని పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఆయన సంక్షేమ పథకాలతో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందంటే జగనన్న ముందు చూపేనన్నారు. నియోజకవర్గంలో ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పుల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈసర్వేకు ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోకల కృష్ణమోహన్, ఉప్పలపాటి చెంగలయ్య, కోట హరిప్రసాద్, అడపా సుధాకర్‌రెడ్డి, ముప్పాళ్ల రాఘవయ్య, తులసి నాగమణి, ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, జంగా అనీల్, గాదె సురేష్, షేక్ కాలేషా, చిన్ని, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హుల వద్దకే సంక్షేమ పథకాలు


మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కృష్ణ చైతన్య

అద్దంకి రూరల్: సంక్షేమ పథకాలు అందించటంలో దళారుల ప్రమేయం లేకుండా నేరుగ అర్హుల ఖాతాలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జమ చేస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం మణికేశ్వరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. జగనన్న పాలనలో ప్రజలు అధిక సంఖ్యలో లబ్ధి పొందారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు , అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో రోగులకు పునర్జన్మ

- ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి అశోక్‌బాబు


ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగిని పరామర్శిస్తున్న అశోక్‌బాబు

చీరాల అర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీకి జన్మనిచ్చింది వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే పునర్జన్మనిచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. గురువారం ఆయన చీరాలలోని శ్రీకామాక్షి కేర్‌హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులను ఆయన పరామర్శించారు. రోగులతో ఆయన స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కార్పొరేట్ వైద్యం పేదవాడికి అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఆయన మరణానంతరం 2014 నుంచి 2019 వరకు ఉన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి పేదలకు వైద్యం అందించకుండా, ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు నిధులు కేటాయించకుండా ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చిందన్నారు. 108, 104 వాహనాలను మూలనపడేసి ఆపదలో ఉన్న వారి చెంతకు వెళ్లలేని స్థితికి తీసుకువచ్చారి దుయ్యబట్టారు. అనంతరం ఆరోగ్య సురక్ష కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్న శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్‌ను, సిబ్బందిని అభినందించారు.

నాసరరెడ్డి సేవలు ప్రశంసనీయం


నాసరరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించిన చైతన్య

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామాభివృద్ధికి 18 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా ఇప్పల నాసరరెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం కూకట్లపల్లిలో జరిగిన నాసరరెడ్డి కర్మలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పిచారు. మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్ ఇప్పల అయ్యప్పరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, జానీడీర్ సుబ్బారెడ్డి, రామిరెడ్డి ఉన్నారు.

పల్లెపాలెంలో స్వచ్ఛతాహీ సేవా


స్వచ్ఛతాహీ కార్యక్రమంలో అధికారులు

చినగంజాం: మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరధిలోని బాపయ్యనగర్ తీర ప్రాంతంలో భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను అలవర్చుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ ద్వార మన గ్రామాల్లోను స్వచ్ఛంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు. సర్పంచ్ సైకం మనీ, ఈవోపీఆర్డీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి


విద్యార్థులకు బట్టలు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు


చీరాలలో మాట్లాడుతున్న జీవీ రత్నాకర్


అద్దంకిలో గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు


జాషువా విగ్రహానికి పూలమాల వేస్తున్న పెద్దలు

అద్దంకి: కవి కోకిల గుర్రం జాషువా జయంతి గురువారం పట్టణంలోని కొత్త పసుమర్తిపాలెంలో ఘనంగా నిర్వహించారు. జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య మాట్లాడుతూ జాషువా జీవితంలో విద్యార్థి దశ నుంచి అస్పృస్యత, అంటరానితనాన్ని అనుభవిచారని చెప్పారు. అణచివేతకు గురైన విషయాన్ని గుర్తు చేశారు. అయినా మొక్కవోని దీక్షతో ఉన్నత విద్యను అభ్యసించి తన కవిత్వంతో అంటరానితనాన్ని నిర్మూలించే విధంగా తోడ్పాడు నిచ్చారన్నారు. అయితే ఆ తర్వాత మహోన్నత కవుల నుంచి సన్మానాలు సత్కారాలు అందుకునే స్థాయికి ఎదిగిన జాషువా జీవితం అందరికీ ఆదర్శమని చెప్పారు. ఎంఎస్‌పీ అధ్యక్షుడు బి. లక్ష్మి నరసయ్య, మండల ఇన్‌చార్జి చక్రవర్తి, ఎండ్లూరి ఆంటోని, పల్లిపోగు నాని, ఇతర మండలాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: కవికోకిల గుర్రం జాషువా 128 జయంతి కార్యక్రమానికి మాదిగి రిజర్వేషన్ పోరాట సమితి మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్త పసుమర్తి వారి పాలెంలోని జాషువా విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి బాలకోటయ్య మాట్లాడుతూ తన కవిత్వం ద్వారా అంటరానితనాన్ని నిర్మూలనకు పోరాటం చేశారన్నారు. ఎంఎస్‌పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, మండల ఇన్‌చార్జి నాగిపోగు చక్రవర్తి, అద్దంకి పట్టణ ఇన్‌చార్జి ఎండ్లూరి బాపట్ల జిల్లా కన్వీనర్ ఆంటోని, పల్లిపోగు నాని, కొరిశపాడు మండల కన్వీనర్ వరగాని రమేష్, తేల్ల శ్రీనివాసరావు, సురభిశ్రీను పాల్గొన్నారు.

చీరాల అర్బన్: గుర్రం జాషువా సాహితి సమితి, యూటీఎఫ్, కెవిపిఎస్, జేవీవీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల ఎన్జీఓ భవనంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటి సభ్యులు లింగం జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మౌలానా అజాద్, నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ హెచ్‌ఓడీ డాక్టర్ జీవీ రత్నాకర్, సెంట్రల్ యూనివర్శిటి ప్రొఫెసర్ డాక్టర్ శరత్ చంద్ర, కవి, విమర్శకులు పి.శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బండి భిక్షాలు, అంబేడ్కర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌జె చిరంజీవి, ప్రజాసంఘాల నాయకులు ఎన్ బాబూరావు, ఏసోబు, గుమ్మడి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విప్లవ వీరుడు భగత్‌సింగ్, నవయుగ వైతాళికుడు గుర్రం జాషువాల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్, జాషువాల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్, నెప్పలి రాజ్యలక్ష్మి భర్త జానకీరావుల ఆర్థిక సహకారంతో తల్లిదండ్రులు లేని నిరుపేద విద్యార్థులకు స్థానిక చినజీయర్ ట్రస్ట్ పాఠశాలలో రూ.15 వేల విలువైన నూతన వస్త్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, ఈ ఆంజనేయులు, సాంబశివరావులు పాల్గొన్నారు.

చీరాల రూరల్: చీరాల విజయనగర్ కాలనీలో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు దుడ్డు భాస్కరరావు తేళ్ల వెంకటస్వామి, బుడంగుంట్ల లక్ష్మి నరసయ్య, గొర్రెపాటి రవికుమార్, దుడ్డు వందనం, అత్తోట స్టాలిన్, బొంతా రామారావు, తేళ్ల సైమన్, అంకయ్య, యాకోబు, పౌలు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ బలోపేతానికి కృషి

కారంచేడు: ఆటో యూనియన్ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తానని యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆవులమంద వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రసన్నాంజనేయ ఆటో వర్కర్స్ యూనియన్ మొదటి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ మండల శాఖ ప్రధానకార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, సీఐటీయూ సంఘం గౌరవ అధ్యక్షుడు పీ కొండయ్య, కార్మికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

వివాహిత కుటుంబ సభ్యులకు అప్పగింత

తుని: భర్తతో గొడవ పడి రైలులో తుని రైల్వేస్టేషన్‌కు వచ్చిన వివాహితను ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. చీరాలకు చెందిన కొండ్రు కీర్తి తన భర్త స్టాలిన్‌తో గొడవ పడి రైలులో తుని రైల్వేస్టేషన్‌కు వచ్చింది. అక్కడ రెండో ప్లాట్ ఫాంపై కూర్చుని ఏడుస్తుండగా విధి నిర్వహణలో ఉన్న జీఆర్పీ కానిస్టేబుళ్లు డి.సూర్యప్రకాష్, ఆదినారాయణ ఆమెను ప్రశ్నించారు. సమాచారం సేకరించిన పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఆహారం అందించి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ కీర్తి తల్లి ఉమాదేవికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సాయంత్రం తుని వచ్చిన కుటుంబ సభ్యులకు కీర్తిని క్షేమంగా అప్పగించారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు అమూల్యం


ర్యాలీ చేస్తున్న ముస్లింలు

వేటపాలెం: ముస్లింలు మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా గురువారం నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త సమస్త మానవాళికి అందించిన బోధనలు అమూల్యమైన వన్నారు. ఈపండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపులు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ముస్లింలు సోదర భావం, ధర్మ చింతన ఉండాలని బోధనలు తెలుపుతాయన్నారు. మసీదుల్లో మహమ్మద్ ప్రవక్త చరిత్రపై ప్రసంగాన్ని ఇచ్చారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు


అద్దంకిలో ప్రత్యేక అలంకరణలతో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

అద్దంకి రూరల్: వినాయక చవితి సందర్భంగా అద్దంకిలో ఏర్పాటు చేసిన మందిరాల్లో వినాయకుడు నవరాత్రులు నిత్య పూజలందకుని గురువారం నిమ్జనం చేశారు. పందిర్ల వద్ద ట్రాక్టర్‌లపై ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించుకుని పట్టణంలోని వీధులో భక్తులు, మందిరాల కమిటీ సభ్యులు, యువకులు, చినారులు, మహిళలు నృత్యాలు చేస్తూ జైగణేష్‌కి మహరాజ్ అంటూ వినాకుడి ఊరేగించి నిమజ్జనం చేశారు.